బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి అని బాలల సంక్షేమ శాఖ రీజనల్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటపతిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సంస్థలు, వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. అన్ని కాపీలు జతచేసిన దరఖాస్తును నవంబర్ 11వ తేదీలోపు సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ, విజయవాడ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాల్సిన డాక్యుమెంట్లు చెక్ లిస్టు వాటిని http://wdcw. ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందొచ్చని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలని తెలిపారు. సందేహాలుంటే జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ నంబర్ 9491063818ను సంప్రదించాలని తెలిపారు.

పింఛన్.. పరేషాన్..!

సామాజిక పెన్షన్ల పంపిణీలో మండలాధికారుల అత్యుత్సాహం

తెల్లవారుజామున 5 గంటలకు రావాలని సిబ్బందికి హుకుం

6 గంటలకు లాగిన్ కావాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

పంపిణీకి అత్యధిక పంచాయతీ కార్యదర్శులు దూరం

రెండు జిల్లాల్లో దాదాపు 9వేల మంది ఉద్యోగుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాజిక పెన్షన్ల పంపిణీలో మండలాధికారుల అత్యుత్సాహంపై సచివాలయ, ఇతర ఉద్యోగుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలకు భిన్నంగా ఆదేశాలిస్తూ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి మండల, గ్రామస్థాయిలో నెలకొంది. ఒకటో తేదీన పెన్షన్ అందించడం అందరూ హర్షించదగిన విషయం. అందుకుగాను తెల్లవారుజామున ఐదు గంటలకు లాగిన్ అయ్యి పెన్షన్లు పంపిణీ చేయాలని మండల అధికారులు హుకుం జారీ చేయడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గతంలో వాలంటీర్లు ఉదయాన్నే పెన్షన్లు పంపిణీ చేసి తర్వాత తమ సొంత పనులు చేసుకునేవారు. ఉద్యోగుల పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. తెల్లవారుజామున ఐదు గంటలకు విధుల్లో చేరినా సాయంత్రం ఐదు గంటల వరకూ డ్యూటీలో ఉండాలని పంచాయతీ కార్యదర్శులు పనులు అప్పగిస్తున్నారు. దీంతో మహిళా ఉద్యోగులు పిల్లల విషయంలోనూ, వంట చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్న సమయం ఉదయం ఆరు గంటలు. మండలాధికారులు మాత్రం ఐదు గంటలకే రావాలంటూ సచివాలయ ఉద్యోగులకు హుకుం జారీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతినెలా ఒకటో తేదీన పశ్చిమగోదావరి జిల్లాలో 2,32,885 మందికి రూ.155.71 కోట్లు వివిధ సామాజిక పెన్షన్ల కింద పంపిణీ జరుగుతోంది. ఏలూరు జిల్లాలో 2,68,535 మందికి రూ.182.73 కోట్లు పెన్షన్ల కింద అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వాలంటీర్లు పెన్షన్ పంపిణీ

చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులు, స్కూళ్లలో పని చేసే జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, అంగన్‌వాడీ ఉద్యోగులతో పెన్షన్లు పంపిణీ చేయిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పశ్చిమగోదావరిలో 4,015 మంది, ఏలూరు జిల్లాలో ఐదు వేల మంది వరకూ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీలో పాల్గొంటున్నారు. సచివాలయ ఉద్యోగులు మాత్రం పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీలో ఉంటున్నారు. ప్రతి ఉద్యోగి 50 నుంచి 60 మందికి పెన్షన్ సొమ్ము అందిస్తున్నారు. ఒకటో తేదీకి ముందు రోజు సచివాలయ ఉద్యోగి అయిన సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ సొమ్ము బ్యాంకు నుంచి డ్రా చేసి ఉద్యోగులందరికీ ఇస్తున్నారు. ఉద్యోగులు ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటలకు ప్రారంభించినా మధ్యాహ్నానికి పెన్షన్ల పంపిణీ పూర్తిచేసే అవకాశం ఉంది. తెల్లవారుజామున ఐదు గంటలకు పెన్షన్లు పంపిణీ చేయాలని మండలాధికారులు ఆదేశించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. శీతాకాలం ప్రారంభమైంది. ఉదయం ఐదు గంటలకు చీకటిగానే ఉంటుంది. అటువంటి సమయంలో మహిళా ఉద్యోగులు పెన్షన్ సొమ్ము తీసుకుని బయటికి వస్తుంటే కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు నిద్ర లేపడంతో పెన్షన్ సొమ్ము అందుకుంటున్న కుటుంబాల్లోని సభ్యులు కూడా ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. మండలాధికారుల అతిని కట్టడి చేసి సచివాలయ, ఇతర ఉద్యోగులకు ఊరట కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పెన్షన్ల పంపిణీకి పంచాయతీ కార్యదర్శులు దూరం

గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీలో పాల్గొనాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. అత్యధిక భాగం పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం లేదు. దీంతో ఉద్యోగులే ఆ పెన్షన్లను పంపిణీ చేయాల్సి వస్తోంది. దీంతో మరింత ఆలస్యమవుతోంది. ఉదయం ఐదు గంటలకే విధుల్లో చేరినప్పటికీ సచివాలయ ఉద్యోగులకు సాయంత్రం ఐదు గంటల వరకూ వివిధ పనులు అప్పగిస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విధుల్లో ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. ఒకటో తేదీతోపాటు ఇతర రోజుల్లోనూ ఉదయం పది గంటలకే సచివాలయ ఉద్యోగులు రావాలని పంచాయతీ కార్యదర్శులు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎదురు ప్రశ్నిస్తే పనుల పేరుతో తీవ్రంగా వేధిస్తుండటంతో అంతా హౌనంగా భరిస్తున్నారు. సచివాలయ వ్యవస్థపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.పదివేల వేతనంతో వాలంటీర్లను నియమిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అధికారంలోకొచ్చి నాలుగునెలలైనా ఇప్పటి వరకూ వాలంటీర్ల నియామకం చేపట్టలేదు. వాలంటీర్లను నియమిస్తే పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

దీపావళి ఆనందంగా జరుపుకోవాలి

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతి కుటుంబమూ ఆనందోత్సవాలలో దీపావళి పండుగను జరుపుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర, పాలకొల్లు నియోజకవర్గ ప్రజలకు మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జగన్ ఐదేళ్ల రాక్షస, నిరంకుశ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టిన రాష్ట్ర ప్రజలందరూ చెడుపై సాధించిన మంచి విజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకుంటామన్నారు. ఈ దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ సుఖశాంతులతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

అందరికీ దీపావళి శుభాకాంక్షలు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చీకట్లను చెరిపేసి మీ జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి బుధవారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పండుగలో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మందులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలన్నారు. సగం కాల్చిన టపాసులను మళ్లీ తిరిగి కాల్చకూడదని, ఆ సమయంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

భీమవరానికి కొత్త హంగులు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణం రాబోయే రోజుల్లో సుందరీకరణతో కొత్త రూపు సంతరించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి భీమవరం సుందరీకరణ పనులపై జిల్లా జాయింట్ కలెక్టర్, భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డితో సమీక్షించి మాట్లాడారు. భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు పూర్తయిందన్నారు. జిల్లా కేంద్రంగా ఒక ప్రత్యేక రూపు సంతరించుకునేలా భీమవరాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే చిన్న చిన్న సుందరీకరణ పనులను చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున సుందరీకరణ పనులు చేపట్టి పట్టణ రూపురేఖలు మార్చేదిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏ ప్రదేశాల్లో ఏం ఏర్పాటు చేయాలి, డిజైన్లు, టెండర్ల ఖరారు, ఏజెన్సీల గుర్తింపు వంటి విషయాలపై సమీక్షించినట్లు తెలిపారు. ప్రధానంగా కూడళ్లు,

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

వంతెనలు, పార్కులు, ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల అలంకరణను చేపట్టినట్లు తెలిపారు. వాటర్ ఫౌంటెన్లు, మ్యూజికల్ ఫౌంటెన్లు, విగ్రహాలకు లైటింగ్ ఏర్పాట్లు, వాల్ పెయింటింగ్స్, గ్రీనరీ అభివృద్ధి, రకరకాల పూల మొక్కల ఏర్పాటు, ఈట్ స్ట్రీట్ ఏర్పాటు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. షాపు యజమానులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, అలా చేస్తే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి క్యారీ బ్యాగుల నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వాటి స్థానంలో కాగితం, క్లాత్, జ్యూట్ బ్యాగులు మాత్రమే వినియోగించాలని సూచించారు.

పండుగ వేళ పెను విషాదం

సూర్యారావుపాలెం ఘటనలో మృతులు, క్షతగాత్రులు పశ్చిమవాసులే

ఇద్దరు దుర్మరణం, ఐదుగురికి తీవ్ర గాయాలు

శోకసంద్రంలో దువ్వ, రావిపాడు

ప్రమాద స్థలం

ప్రజాశక్తి - తణుకు రూరల్

అంతా దీపావళి హడావుడిలో ఉన్నారు. దీపావళి సామగ్రి తయారీ కేంద్రంలోని మహిళలు కూడా త్వరగా పని ముగించుకుని ఇంటికి వెళ్లాలనే ఆలోచనల్లో ఉన్నారు. మరోపక్క మబ్బు, ఉరుములు.. అదే సమయంలో తాము పని చేసే తయారీ కేంద్రానికి ఆనుకుని ఉన్న కొబ్బరి చెట్లపై పిడుగులు పడడం, ఆ నిప్పురవ్వలు తయారీ కేంద్రంపై పడి బాణసంచాకు నిప్పంటుకుని మంటలు ఎగసిపడడం క్షణాల్లో జరిగిపోయింది. తేరుకుని బయట పడేలోపే మంటలు చుట్టుముట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మరో పది మంది స్వల్ప గాయాలపాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం శివార్లలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం దువ్వ, పెంటపాడు మండలం రావిపాడు గ్రామాల్లో పెనువిషాదాన్ని నింపింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దువ్వకు చెందిన వేగిరోతు శివ బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తాడు. గతంలో దువ్వలోనే ఈ కేంద్రం నిర్వహిస్తుండగా గత సంవత్సరం ఈ కేంద్రానికి అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనుమతులు తెచ్చుకుని సూర్యారావుపాలెంలో తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఇక్కడ పని చేయడానికి దువ్వ, రావిపాడు గ్రామాల నుంచి మహిళలను తీసుకెళ్తుంటారు. అదే విధంగా సుమారు 15



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

మందికిపైగా మహిళలు, మరికొంత మంది పురుషులు ఈ కేంద్రానికి పని నిమిత్తం వెళ్లారు. బుధవారం సాయంత్రం పిడుగుపాటు వల్ల చెలరేగిన మంటల్లో తయారీ కేంద్రం యజమాని భార్య వేగిరోతు శ్రీవల్లి (25), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత (38) అక్కడికక్కడే మృతి చెందారు. కావలిపురానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు, రావిపాడుకు చెందిన మందలంక కమలారత్నం, శీలం లక్ష్మి, దువ్వకు చెందిన కడిమి కుమారి, దాశెట్టి పద్మ తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. తణుకు ఆస్పత్రిలో క్షతగాత్రులను తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు.

మృతుల్లో ఒకరైన సునీతకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త అట్టల ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేస్తుండగా కుమారుడు ఇంటర్‌తో చదువు ఆపేసి కూలి పనులకు వెళ్తున్నాడు. కుమార్తె ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

ప్రమాదం పట్ల కలెక్టర్ దిగ్భ్రాంతి

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

భీమవరం: తూర్పుగోదావరి జిల్లాలోని సూర్యారావుపాలెంలో పిడుగుపాటుకు బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదం పట్ల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగ సమయంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.20 వేల కోట్ల భారాలను తక్షణం రద్దు చేయాలని సిపిఎం పోడూరు శాఖా కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడూరు మండల సొసైటీ వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పిల్లి.ప్రసాద్ మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ భరోసా ఇచ్చి నాలుగు నెలలకే ప్రభుత్వం ఛార్జీల మోత మోగిస్తోందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల్లో ఇంధన సర్దుబాటు ట్రూఅప్ ఛార్జీలు సెస్సులు రద్దు చేయాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని గతంలో వాడుకున్న కరెంట్‌కు నేడు బిల్లులు వేసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న సామాన్య

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజానీకానికి ఇది పెనుభారంగా మారిందని వాపోయారు. షార్ట్ టర్మ్ కొనుగోలు పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం దారుణమన్నారు. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొంతు శ్రీను, బూరాబత్తుల వెంకట్రావు, కె.శేషగిరిరావు, కుడిపూడి సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, టి.లక్ష్మణరావు, డేవిడ్ పాల్గొన్నారు.

ప్రజా గొంతుక గోపీమూర్తి

ఎంఎల్‌సిగా గోపీమూర్తిని గెలిపించుకోవాలి

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఈ నేపథ్యంలో చట్టసభల్లో పిడిఎఫ్ ప్రాతినిధ్యం అవసరం ఎంతో ఉందని పలువురు వక్తలు అన్నారు. విద్యారంగ పరిరక్షణ, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న ప్రజా గొంతుక పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తిని ఎంఎల్‌సిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గోపీమూర్తి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు అధ్యక్షతన బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న గోపీమూర్తి తన 12 ఏళ్ల సర్వీసును వదులుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కారానికి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయడం మామూలు విషయం కాదన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

సమస్యల పరిష్కారానికి ప్రజలకు సేవ చేయాలనే ముఖ్యోద్దేశంతో గోపీమూర్తి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. నిరంతరం యుటిఎఫ్ ఆశయ సాధనకు గోపీమూర్తి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. జిల్లాలో ఉద్యమ సారధిగా ఎంఎల్‌సి షాబ్జీ ఉద్యమ వారసులుగా గోపీమూర్తి కొనసాగడం అభినందనీయమన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి వారసత్వం కొనసాగాలంటే గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తున్న నన్ను పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడం మరింత బాధ్యత పెంచిందన్నారు. ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాలో పర్యటించి ఉపాధ్యాయులను, ముఖ్య నేతలను కలుసుకున్నానని, వారి నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనను ఎంఎల్‌సిగా గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. అనంతరం గోపీమూర్తిని, ఆయన సతీమణి క్రాంతిరేఖను మెమెంటోతో సత్కరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, గౌరవ అధ్యక్షులు మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి పద్మావతి, జిల్లా కోశాధికారి సిహెచ్. పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు శివ ప్రసాద్, రామకృష్ణ ప్రసాద్, పి.క్రాంత్ కుమార్, రత్నంరాజు, లక్ష్మీనారాయణ, ఏసుబాబు, సాయిరాం, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమవరంలో కౌశల్-2024 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

భారతీయ విజ్ఞాన మండలి, ఎపి సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌశల్ రాష్ట్రస్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివి ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌బిఎల్.నారాయణ అన్నారు. కలెక్టరేట్లో కౌశల్ 2024 పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌశల్ జిల్లా సమన్వయ అధికారి ఆచంట వరప్రకాష్ మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి విద్యార్థులు నవంబర్ 15వ తేదీలోపు వారి పాఠశాలల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాఠశాల స్థాయి పరీక్ష ఆన్‌లైన్లో నవంబర్ 20, 21, 22 తేదీల్లో ఉంటుందని తెలిపారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, రీల్స్ విభాగాలు ఉంటాయని తెలిపారు. కౌశల్ పరిశీలకులుగా రేపాక వెంకన్న బాబు, జి.శ్రీనివాస వర్మ, ఎ.శరత్‌చంద్ర సయ్యద్ షహేన్షా వ్యవహరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయకర్తను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు కె.సంధ్య, ఎన్.సత్యనారాయణ, ఎంఇఒలు ఎన్.శ్రీనివాసరావు, వేంద్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇవివిఎన్‌ఎస్‌ఎస్‌ఎస్‌బిఎల్.నారాయణ యుటిఎఫ్ జిల్లా కమిటీ నేతలు కలెక్టరేట్లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా ట్రెజరర్ సిహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, సిహెచ్ కుమార్‌బాబ్జి, కె.రామకృష్ణ ప్రసాద్, జి.అబ్రహం, బి.నాగబాబు, జి.భవానీప్రసాద్, కె.త్రిమూర్తులు, పిల్లి శ్రీనివాస్, ఎస్‌కె పాషా డిఇఒకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కమిటీ నేతలు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, మున్సిపల్ పాఠశాలల్లో విలీనమైనా ఇంకా వారిని మున్సిపల్ టీచర్లతో కలిపి సీనియార్టీ లిస్టులో కలపలేదని వారిని వెంటనే కలిపి ప్రమోషన్స్‌కు అర్హత కల్పించాలని కోరారు. జనవరి నుండి రిటైర్ అయ్యే ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ నోటీసులు ఇవ్వాలన్నారు.

దుకాణాలు వెలవెల.. వ్యాపారులు విలవిల

పెరిగిన బాణసంచా ధరలు - తగ్గిన కొనుగోళ్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఒక్కప్పుడు దీపావళి అంటే మూడు రోజులపాటు పండుగ చేసుకునే వారు. ఇప్పుడు ఒక్క రోజు చేసుకోవాలన్నా అతి కష్టంగా మారుతోంది. కారణం పెరుగుతున్న ధరలు. తణుకు మండల, పట్టణంలో 32 దుకాణాలు, దువ్వ పరిధిలో జాతీయ రహదారిపై 18 దుకాణాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఫైర్, పోలీస్, రెవెన్యూ అనుమతుల కోసం సుమారుగా రూ.25 వేలు చొప్పున మధ్యవర్తులు వసూలు చేసినట్లు సమాచారం. షాపుల ఏర్పాటుకు మరో రూ.15 వేలు చొప్పున, అదేవిధంగా బాణసంచా నిమిత్తం రూ.లక్షలు వెచ్చించారు. అయితే ఇంత ఖర్చు చేసిన దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెల బోతూ దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాపారులు డీలా పడిపోయారు. పెట్టుబడులు కూడా వస్తాయో లేదో అని వ్యాపారులు వాపోతున్నారు. ఒక వైపు ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులో లేక సుమారు 32 రకాల భవన నిర్మాణ రంగాల కార్మికులకు పనులు లేకపోవడం కూడా బాణసంచా వ్యాపారాలు సన్నగిల్లినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడంతో తాము నష్టాలు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు చేయాలి

ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

కార్తీక మాసంలో వశిష్ట గోదావరిలో స్నానాలు చేసే యాత్రికులు, స్వాములకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్నానాల రేవులను సిద్ధం చేయాలని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని వలంధర్, అమరేశ్వర స్నాన ఘట్టాలను ఆయన పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న పనులను పూర్తిచేయాలని, రేవుల్లో స్నానం చేసిన మహిళలు బట్టల మార్చుకునేందుకు వీలుగా తాత్కాలిక రూములు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని ఎంఎల్‌ఎ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టిడిపి ఇన్‌ఛార్జి రామరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఘంటా కృష్ణ, కంచర్ల ఫణికర్, బందెల రవీంద్ర, పొలిశెట్టి సాంబ, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.

వలంధర రేవును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

రోడ్లు వేసి ప్రజల ప్రాణాలు కాపాడండి

సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

నవుదురు జంక్షన్ నుంచి మదుగు పోలవరం లంక వరకు ఆర్ అండ్ బి రోడ్ వెడల్పు పెంచే పనులు వెంటనే ప్రారంభించి ప్రమాదాలు నివారించాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహ మూర్తి విజ్ఞప్తి చేశారు. ఉత్తరపాలెం-కొణితి వాడ సిపిఎం శాఖ మహాసభ పాల అజయ్ గోస్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ సభ్యులు కడలి వీరస్వెట్టి ఆవిష్కరించారు. కార్యదర్శి నివేదికను కేతా జ్యోతి బసు ప్రవేశపెట్టారు. ఈ సభలో అతిథిగా పాల్గొన్న నరసింహ మూర్తి మాట్లాడుతూ మండలంలో రోడ్లు వేయాలని సిపిఎం 2020 నుంచి 2023 వరకు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా కొన్ని రోడ్లు వేశారన్నారు. ఈ సభలో పాల కోటేశ్వరరావు, జుత్తిగ సాంబియాబు, కిలాడి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు. మహాసభ అనంతరం కేతా జ్యోతిబసు తిరిగి శాఖాకార్యదర్శిగా ఎన్నికయ్యారు.

'జనవాణి' ద్వారా అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమంలో తాడేపల్లి గూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంఎల్ఎతో పాటు నరసాపురంకు చెందిన జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) ప్రజల వద్ద అర్జీలు స్వీకరించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలకు పనిచేస్తున్న స్థలాల్లో భద్రత కల్పించాలని ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం శేష్ మహల్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివిధ స్థలాలలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. లైంగిక వేధింపులు పాల్పడుతున్నటువంటి వారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని, మహిళలకు భద్రత కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఉదయభాను, పల్లి రాజేష్, వెంకటేశ్వరరావు, యేసు, ఆసిన్ భాష, రాజు, వై.శ్రీను పాల్గొన్నారు.

దళిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రక్కాల నాగ బుజ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వాధికారుల ద్వారా దళితుల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. బుధవారం కడియద్ద గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి వెంకటేష్ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి, అభివృద్ధిలో తల్లిదండ్రులు కృషిచేయాలని అన్నారు. గ్రామంలోని దళితుల శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని, అర్హులైన వృద్ధులందరికీ పెన్షన్ అందజేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ రాజు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, సాంఘిక శాఖ అధికారి రాము, గ్రామ మాజీ సర్పంచి కిరణ్ కుమార్, ప్రభుత్వాధికారులు, గ్రామ పెద్దలు, దళితులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.కొండలరావు సూచించారు. బుధవారం స్థానిక మోర్గాన్ కాలేజీ విద్యార్థులకు హెల్మెట్ ధరించుట వల్ల కలిగే ప్రయోజనాల గురించి, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కొండలరావు మాట్లాడుతూ వాహన ప్రమాదాలలో ఎక్కువ శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవిస్తున్నాయని, కాబట్టి ప్రతి ఒక్క వ్యక్తి హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

చెస్‌లో ఎస్‌కెఎస్‌డి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ, చెస్, ఉమెన్ ఇంటర్ కాలేజియేట్, యూనివర్సిటీ సెలక్షన్స్ ఈనెల 26, 27వ తేదీల్లో బి.వి.రాజు కళాశాల భీమవరంలో జరిగాయి. ఈ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రథమస్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయి తెలియజేశారు. ఈ సందర్భంగా సుందరీబాయి మాట్లాడుతూ టిఎస్ఎన్ఎస్ఎల్ఎస్ శ్రావణి, ఎం.శ్రీరమ్య, కె.జ్యోతి, ఎం.శ్రీలత విజేతలను అభినందించారు.

కాలువ రేవులు శుభ్రం

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర [?] జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలనుసారం కార్తీక మాసం సందర్భంగా పాలకొల్లులో ఉన్న అన్ని రేవులను మున్సిపల్ సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. మహిళలు స్నానాలు చేసే ఐబ్బలు మార్కుకోవడానికి పనులను ఏర్పాటు గురించి మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులకు, మున్సిపల్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. జివి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి బాబు, బెలంకొండ్ర చంద్రమూర్తి పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులంతా ముందుగానే తమ పాఠశాలలో బుధవారం దీపావళి పండుగ వేడుకలు జరుపుకున్నారు. పాఠశాలలో దీపావళి పండుగ కోలాహలం నిండి, ఎంతో ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా తమ ఉపాధ్యాయులతో కలిసి దీపావళి పండుగ విశేషాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పర్యావరణ హితంగా తమ స్నేహితులతో కలిసి కేరింతలతో టపాసులు కాలుస్తూ ఆనందించారు. స్కూల్ కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి మాట్లాడుతూ అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్ష్మణేశ్వరంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని లక్ష్మణేశ్వరం 1, 2 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి మాట్లాడుతూ వరిలో ఎరువుల యాజమాన్యం సమగ్రవంతంగా చేపట్టాలన్నారు. సాధారణంగా ఒక ఎకరానికి 15 కిలోల యూరియా, 50 కిలోల భాస్వరం, 14 కిలోల పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో పొలంలో కలియదున్నాలి. మొక్క 15-20 రోజుల దశకు చెరుకున్నప్పుడు 30-35 కిలోల యూరియా, ముదు దశల్లో అంటే అంకురం ఏర్పడే దశలో మరో 30-35 కిలోల యూరియా అందించాలని తెలిపారు. ఎఇఒ ఐ.లక్ష్మీనారాయణ, వి.ఎఎ.లక్ష్మీకాంతం వెన్నెల, విహెచ్ఎ.జయలక్ష్మి పాల్గొన్నారు.

'షర్మిలను విమర్శిస్తే సహించం'

ప్రజాశక్తి - తణుకు

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి మీద విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడలి రామారావు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ షర్మిలారెడ్డికి కాంగ్రెస్ అండగా ఉందని, ఆమెపై అనుచిత ఆరోపణలు చేస్తూ వ్యాఖ్యానాలు చేస్తున్నారని, దీనిని ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. జగన్ తన సొంత చెల్లి అని చూడకుండా సోషల్ మీడియాలో దారుణమైన కామెంట్లు చేస్తున్నా స్పందించకపోవడం అన్యాయమన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి : ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉండి మండలం ఉణుదుర్రు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అద్దంకి రామా రావు(44) ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలతో ఈనెల 22వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సహకారంతో భార్య వరలక్ష్మి ఆసుపత్రిలో చికిత్స చేయించి పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం రాత్రి నాని మరణించాడని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మార్కెట్లో దీపావళి సందడి

మట్టి ప్రమిదలకు మంచి డిమాండ్

ప్రజల ఆసక్తిని అవకాశంగా తీసుకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మార్కెట్లో దీపావళి సందడి నెలకొంది. మట్టి ప్రమిదులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నల్లమట్టిని తెచ్చి ప్రతిమలుగా మలిచి, ఎండ బెట్టి, వాటిని మంటలో కాల్చుతారు. ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ ఆకృతులతో, చక్కటి డిజైన్లతో తయారు చేసి విక్రయించేందుకు దుకాణదారులు సిద్ధంగా ఉంచారు. స్వస్తిక్, ఓం, చతుర, త్రిముఖ, తులసి కోట, స్వాగత భామలు, నారికేళం, తదితర ప్రమిదులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇంటి ముంగింట్లో కాంతులు ఇచ్చే దీప ప్రమిదలు ఏర్పాటు చేసి, దీపావళి రోజు సాయంకాలం వేళ వాటిని వెలిగిస్తారు. దీపావళి పండుగ రోజున వ్యాపారులు లక్ష్మీదేవి పూజలు చేస్తుండగా, ప్రమిదులను ఏర్పాటు చేసి, వాటిలో నూనె వేసి ఒత్తులను వేసి వెలిగిస్తారు. ఇవే కాకుండా రెడీమేడ్ దీపాల కంటే మట్టి ప్రమిదల్లోనే దీపాలను వెలిగిస్తే మోక్షమని ప్రజల నమ్మకం. పట్టణంలోని కొన్ని వ్యాపారాల సముదాయాల వద్ద వీటిని విక్రయించేందుకు వ్యాపారస్తులు సిద్ధంగా ఉంచారు. ఒక్కో ప్రమిదకు రూ.3 నుంచి డిజైన్‌ను బట్టి రూ.300 వరకు ఉన్నాయని విక్రయదారులు రావి సత్యనారాయణ తెలిపారు.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రమిదలు

పెన్షన్లు సకాలంలో అందజేయాలి

ఎంపిడిఒ శ్రీలక్ష్మి

గణపవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా నవంబరు నెల పెన్షన్లు పంచాయతీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది జాప్యం లేకుండా సకాలంలో అందజేయాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి బుధవారం ఆదేశించారు. ఈనెల 31న దీపావళి పండుగ సందర్భంగా పెన్షన్ అమౌంటులు 30వ తేదీన బ్యాంకు నుంచి డ్రా చేసుకోవాలని చెప్పారు. 1వ తేదీ ఉదయం 6 గంటలకు పెన్షన్లు పంపిణీ చేయాలని చెప్పారు. పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెన్షన్లు నూటికి నూరుశాతం పంపిణీ చేయాలని అన్నారు. పెన్షన్లు అందని వారికి నవంబర్ రెండవ తేదీన అధికారులు అందజేస్తారని తెలిపారు.

విద్యార్థినులకు పోషకాహారం అందించాలి

ఎంఎల్ఎ నాయకర్

నరసాపురం : విద్యార్థినులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఆదేశించారు. మండలంలోని లక్ష్మణేశ్వరం మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినీలతో మాట్లాడారు. ఆహారం, వసతి, విద్యాబోధన తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, బందేల రవీంద్ర, గంట కృష్ణ, మాదం వాసు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు సమతుల ఆహారం తీసుకోవాలి

పిహెచ్‌సి వైద్యులు సంతోష్

గణపవరం : రక్తహీనత నివారణకు ప్రతిఒక్కరూ సమతుల ఆహారం సమతుల్యంగా తీసుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్ అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వైద్య శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. శిబిరంలో గ్రామీణ మహిళలకు, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం హిమోగ్లోబిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తహీనత సమస్యలు ఉన్నవారికి మందులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ కాలేజీ కమ్యూనిటీ ఆరోగ్య కార్యక్రమాల పట్ల నిబద్ధతను వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య భద్రతకు విద్యాసంస్థలు చేస్తున్న కృషిని వివరించారు. కాలేజీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతం చేయడానికి కృషిచేసిన ఎన్‌ఎస్ఎస్ యూనిట్, ఎల్ క్యూ ఎసి, వైఆర్‌సిఎస్, పిహెచ్‌సి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, లెక్చరర్లు సిహెచ్.చైతన్య, టి.అక్కిరాజు, షేక్ పర్వీన్, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

తణుకు : అనారోగ్య బారిన పడి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకొని, సహాయం కోసం చూస్తున్న వారికి మరలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద తణుకు నియోజకవర్గంలో 12 మంది సభ్యులకు రూ.15 లక్షల 7 వేల 559 ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులకు చెక్కు రూపంలో అందజేశారు. పేదవారికి నారా చంద్రబాబునాయుడు అండగా నిలుస్తున్నారన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కలెక్టర్

పాలకోడేరు : ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి వెళ్లేలా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పాలకోడేరు మండల సమైక్య భవనంలో జిల్లా సమైక్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ బీమా పథకాలు, వివిధ వర్గాల ప్రజల ప్రగతికి తోడ్పడే కార్యక్రమాలను ఎల్లప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పిఎంజెఎవై, పిఎంజెజెబివై, పంటల బీమా, ఉల్లాస్ నిరక్షరాస్యులకు విద్య, నైపుణ్య గణన, పిఎంఇజిపి, ఒఎన్‌డిసి ఆన్‌లైన్ బిజినెస్, కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్-ఎస్.వేణుగోపాల్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు పి.అరుణకుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజరు ఎ.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో 5కె రన్

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5కె రన్ సైకిల్ ర్యాలీని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు వన్ అండ్ టు, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ఎన్ఎస్ఎస్ వారి ఉత్తర్వులను అనుసరించి ఈ కార్యక్రమంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలతో ఆవిష్కృతం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత ప్రథమ హోంమంత్రి, ప్రథమ ఉప ప్రధాని పదవులను చేపట్టి, ఉక్కుమనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని జాతీయ ఐక్యతా దినోత్సవంగా భారత ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు, ప్రసన్న నాగదేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న శ్రీరాములు

ఉండి: ఉండి మండలం పాములపర్రు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు తోట శ్రీరాములు టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించిన సభ్యత్వ నమోదుకు సంబంధించి ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం తీసుకోగా, వారితో పాటు తాను కూడా శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు ప్రకటించారు.

భీమవరంలో 'రన్ ఫర్ యూనిటీ'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రకాశం చౌక్ నుంచి మొదలైన ఈ కార్యక్రమం అంబేద్కర్ విగ్రహం, బొంబాయి స్వీట్ కూడలి మీదుగా పాత బస్టాండ్ వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఇంత విజయవంతంగా నిర్వహించడానికి గత పది రోజులుగా తమ సహాయ సహకారాలు అందిస్తున్న స్థానిక కళాశాల యాజమాన్యాలకు, విద్యార్థులకు, స్వచ్ఛంద సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్‌పి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పలువురికి పోలీస్ శాఖ తరుపున జ్ఞాపకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మితో పాటు జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు , భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి రావూరి గణేష్ జయసూర్య, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎం.సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు, విద్యార్థులు, ప్రజలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదరహితుడు మాణిక్యం

ఉద్యోగ విరమణ సభలో పలువురు

ఆకివీడు : ప్రజలతో అతి దగ్గర సంబంధాలు పెంచుకుంటూ వివాదరహితుడుగా పేరుపొందిన వ్యక్తి మాణిక్యం అని వక్తలు కొనియాడారు. స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ మాణిక్యం ఈనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయనకు సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక ప్రముఖులు రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వానపల్లి బాబురావు మాట్లాడుతూ సుమారు ఆరున్నర సంవత్సరాలు ఒకే చోట పనిచేయగలడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నారు. వివాదాలు లేకుండా ప్రజలతో, ప్రయాణికులతో సన్నిహితంగా ఉండగలగటం మరొక కారణమని రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులు వాడపల్లి మోహన్ అన్నారు. ప్రయాణికులకు ఏవిధమైన సమస్యలూ లేకుండా ఇంతకాలం గడపటం ఉద్యోగి నిబద్ధతకు నిదర్శనమని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, స్థానిక కమర్షియల్ మేనేజర్ నందీశ్వరరావు, నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్ మధుబాబు, పలు స్థానిక ప్రముఖులు, రైల్వే యూనియన్ నాయకులు, సిబ్బంది భారీ స్థాయిలో పాల్గొన్నారు. అనంతరం మాణిక్యం దంపతులకు సన్మానం చేశారు.

ఏటిగట్ల ఆధునికీకరణకు కార్యాచరణ

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో పంట కాలువలు, మురుగు కాలువను ప్రక్షాళన చేసి ఏటిగట్ల ఆధునికీకరణకు ఆయా శాఖల అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జలవనరులు, డ్రెయినేజీ, ఏటిగట్ల పరిరక్షణ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటకాలువలు, మురుగు కాలువలు పూడికపోవడం వల్ల బియ్యపుతిప్ప, వేములదీవుల్లో కుక్కిలేరులపై ఉన్న అవుట్ ఫౌల్ స్లూయిజ్‌లు శిథిలమవుతున్నాయన్నారు. వరదనీరు ఎగదన్ని మండలంలో వేలాది ఎకరాల్లో సార్వా పంటతో పాటు దాళ్వా సాగును రైతులు కోల్పోవలసి వస్తుందన్నారు. ఈ పరిస్థితిని పూర్తిస్థాయిలో మార్పు తీసుకువచ్చేందుకు నియోజకవర్గంలోని అన్ని మురుగు, పంట కాలువలు, స్లూయిజ్‌లు ప్రక్షాళన చేయడంతో పాటు పట్టణంలోని ఏటిగట్టును పొన్నపల్లి నుంచి కొండాలమ్మ గుడివరకు రెండు వైపులా పటిష్టం చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. మూడేళ్లలో జరగనున్న పుష్కరాలకు పట్టణ రూపు రేఖలు మారే విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో పంట, పల్లపు ప్రాంతాల ముంపునకు కారణమవుతున్న వేములదీవి గ్రామాల్లో కుక్కిలేరులపై నిర్మించిన అవుట్ ఫాల్ స్లూయిజ్లను పూర్తిగా ఆధునికీకరించాలన్నారు. రానున్న పుష్కరాల సమయాననికి ఏటిగట్టు పొడవునా పూర్తి స్థాయిలో సుందరంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకల సతీశ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండటంలేదన్నారు. పుష్కరాల సమయంలో వేసిన పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ డిఇ సిహెచ్.వెంకట నారాయణ, డ్రెయినేజీ డిఇ సత్యనారాయణ, ఏటిగట్ల పరిరక్షణ శాఖ ఎఇఇ కెవి.సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనమివ్వాలి : సిఐటియు

పెనుగొండ : మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య, కాంట్రాక్ట్ వర్కర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. బుధవారం పంచాయతీ కార్మికురాలు బంగారు విజయ అధ్యక్షతన జరిగిన పెనుగొండ మండల సమావేశంలో సిఐటియు జిల్లా పంచాయతీ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని పంచాయతీలలో వర్కర్లను యాజమాన్యాలు ఇష్టానుసారంగా తొలగిస్తున్నాయని అన్నారు. బాధ్యతతో ఊరుశుభ్రం చేస్తున్న కార్మికుల స్థితిగతులను గ్రామ పంచాయతీలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలపై చర్చించాలని, మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలని, కొబ్బరి నూనె, సబ్బులు, రెండు జతల దుస్తులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, అక్రమ తొలగింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నాగిశెట్టి గంగారావు, బంగారు లక్ష్మి, బొత్స లక్ష్మి, కడిమి నాగేశ్వరరావు, నీలా గంగ, సిహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

పాత పద్ధతినే ప్రవేశపెట్టండి

అధికారుల వద్ద రైతుల విజ్ఞప్తి

ఉండి : గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన రీసర్వే పద్ధతి వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి పాత పద్ధతిని ప్రవేశపెట్టాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉండి మండలం ఉనుదుర్రు గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో పలువురు రైతులు తహశీల్దార్ కె.నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవం లేని సర్వేయర్లతో చేయించిన రీసర్వే వల్ల ఇప్పుడు తామందరం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి, టిడిపి గ్రామ అధ్యక్షులు బండారు వీర రాఘవులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని శేరేపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. రీ సర్వేలో 95 వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. సర్పంచి తణుకుల మునీశ్వరరావు, ఎంపిటిసి విల్లూరు వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాలకోడేరు : మోగల్లు పాత పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించి 65 ఫిర్యాదులు స్వీకరించినట్లు తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి తెలిపారు. ఈ సభకు పంచాయతీ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీసర్వేలో తప్పుల తడకలు ఏమైనా ఉంటే సరిచేసుకునేందుకు రీ సర్వే గ్రామసభలు దోహదపడతాయన్నారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, మండల రెవెన్యూ అధికారి కె.రాఘవమూర్తి రాజు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లును ఆదర్శంగా తీసుకోవాలి : డిపిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

33 ఏళ్లపాటు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్‌గా ప్రభుత్వ సేవలు అందజేసిన నాగళ్లమూడి వెంకటేశ్వర్లు స్ఫూర్తిదాయకులని, ఆయనను అంతా ఆదర్శంగా తీసుకోవాలని డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని డిపిఆర్ఒ కార్యాలయంలో పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగళ్లమూడి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ అభినందన సభకు డిపిఆర్ఒ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో 33 సంవత్సరాలు సేవలందించి, అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను సత్కరించి, జ్ఞాపికను అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంట్ చించిలి శ్రీనివాస నెహ్రూ, ఆర్ఎడి.సోమరాజు, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశాలి, పివై.రత్నాకర్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లను సత్కరిస్తున్న డిపిఆర్ఒ నాగేశ్వరరావు

అట్రాసిటీ కేసులపై విచారణ

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన దళిత నాయకుడు కానేటి బాలరాజుపై గత నెలలో అదే గ్రామానికి చెందిన కొంతమంది అగ్రకుల నాయకులు దాడిచేసిన ఘటనపై నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై బుధవారం అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం మురళీకృష్ణ విచారణ నిర్వహించారు. ఆయన వెంట యలమంచిలి ఎస్ఐ గుర్రయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్ల పరిశీలన

గణపవరం : మండల కేంద్రమైన గణపవరంలోని లేఅవుట్లని బుధవారం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ లేఅవుట్లలో ఇండ్ల నిర్మాణం త్వరత్వరగా పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి కావలసిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటర్నల్, అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను వెంటనే పూర్తిస్థాయిలో నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం హౌసింగ్ ఇంజనీర్ కెవివిఎస్.ప్రసాద్, సహాయక ఇంజనీర్ కిరణ్, గణపవరం ఇంజనీర్ నరేంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఓడూరు గ్రామానికి చెందిన **గుడాల వెంకటేశ్వర్లు, తండ్రి : సూర్యారావు** అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఓడూరు నుండి పెనుమంట్ర జిరాక్స్ కొరకు వెళుతుండగా నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది **పాస్‌పోర్టు నెంబర్ : W0523016** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గుడాల వెంకటేశ్వర్లు, తండ్రి : సూర్యారావు,
డోర్ నెం : 4 - 136, న్యు కాలనీ
ఐ.పి.యస్.చర్చ్, ఓడూరు, పెనుమంట్ర
మండలం, ప.గో.జిల్లా. పిన్ : 534126
సెల్ : 9908169937

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణ కాపురస్తులు **కత్తి కాశీరావు** గారి కుమారుడైన మా క్లయింట్ **కత్తి పూల రత్తయ్య** అను వారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం భీమడోలు ఎస్ఆర్ఓ కు చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.**3191/1997** మరియు డాక్యుమెంట్ నెం.**3193/1997 ది.17-10-2024**న వారి ఇంటివద్ద నుండి ఆటోలో వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఈ ఆస్తిని ఎస్ బి ఎఫ్ సి సంస్థ నందు తనఖా పెట్టబడి ఉన్నది. సదరు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బొమ్మిడి ఖంజిత లక్ష్మి B.Com., LL.M.,
బొమ్మిడి సన్నీరాజ్ B.E., LL.B.,, **అడ్వొకేట్స్**
యామిజాల వారి వీధి, భీమవరం - 534201.
సెల్: 7981915665, 8882464906

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 33/2024

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
...వాది

అండ్

మిద్దే స్వప్న అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్లుటు:

D-1: మిద్దే స్వప్న, W/o. లక్ష్మణరావు, డోర్ నెం. 3-99, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: బోళ్ళ సుబ్రహ్మణ్యం, S/o. మాధవరావు, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 30-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 319/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
...వాది

అండ్

తోలేటి దమయంతి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్లుటు:

D-1: తోలేటి దమయంతి, W/o. నర్సింహరావు, డోర్ నెం. 4-115, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: మారిశెట్టి వీరాస్వామి, S/o. అంజమూర్తి, డోరు నెం. 4-108, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 30-10-2024 సెల్: 98662 59514